క్లుప్తంగా

లింగాకర్షక బుట్టలతో పురుగుల నివారణ



జగ్గయ్యపేట: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరాకు నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని ఏవో వరలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని బూదవాడ, బలుసుపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలలో జింక్ లోపం, ఆకు చుట్టు పురుగు, అగ్గి తెగులు సోకుతున్నట్లు గుర్తించామన్నారు. వీటి నివారణకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు తాము సాగు చేసిన పంటలకు విధిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం పత్తి, వరి, మిర్చి పంటలలో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త వెంకటరెడ్డి, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

బాలుడి చికిత్సకు రూ.10 లక్షలు మంజూరు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన కొత్త భవదీప్ అనే 12 ఏళ్ల బాలుడి కాలుకు చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఇటీవల జగ్గయ్యపేట పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఇళ్లల్లోకి వరద నీరు రావడంతో కొత్త భవదీప్‌కు కాళ్ల ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాయి. విజయవాడలోని ఆస్పత్రిలో చేరగా ఒక కాలు తొలగించారు. మరొక కాలుకు ఇన్‌ఫెక్షన్ వచ్చిన విషయం తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాగోపాల్ సోమవారం భవదీప్‌ను పరామర్శించారు. కాలు చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం చేసేందుకు కృషి చేశారు. దీంతో ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 లక్షలు మంజూరు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే ఈ చెక్కును విజయవాడలోని హాస్పిటల్‌కు వెళ్లి భవదీప్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

దళిత సంఘాల నిరసన



ఇబ్రహీంపట్నం: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేయడంపై ఇబ్రహీంపట్నంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఈ చర్యను నిరసిస్తూ కొద్దిసేపు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఎన్టీటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి బేతపూడి కాంతారావు ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరావు, జయరాజు, పల్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నెట్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన



మైలవరం: బీకాం విద్యార్థులు నెట్ బ్యాంకింగ్ సేవలు, స్మార్ట్ కార్డుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మైలవరం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి. వంశీకృష్ణ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ విద్యార్థులకు కామర్స్ రంగంలో ఉన్న ఉద్యోగావకాశాలను వివరించారు. కామర్స్ విభాగాధిపతి ఎం. శ్రీనివాసరావు, బోటనీ విభాగాధిపతి డాక్టర్ జి.రాముడు, ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్కే కరీముల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

తిరువూరు: చిన్న పిల్లలు, కిశోర బాలికల్లో నులి పురుగుల నివారణకు బుధవారం అన్ని పాఠశాలల్లో మందులు పంపిణీ చేస్తున్నట్లు తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మా బేగం తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక యూపీహెచ్‌సీలో ఆల్బెండజోల్ మందులను వార్డు సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు. 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు ఈ మాత్రలు వేయడం వలన రక్తహీనత నివారిస్తుందని, శరీరంలో పోషకాలను గ్రహించే శక్తి పెరుగుతుందని ఆమె వివరించారు. తిరువూరు పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో మందులను పంపిణీ చేస్తారన్నారు.

చినుకు పడితే ఆఫీసుల్లో మడుగు..

ఎలా పని చేయాలో.. బాబును అడుగు

- చిన్న పాటి వర్షానికే మోకాలి లోతు నీరు నిల్వ
- నానా అగచాట్లు పడుతున్న సిబ్బంది
- కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కరువు



ఇటీవల వర్షాలకు కంచికచర్ల ఎంపీడీవో కార్యాలయంలోకి చేరిన వర్షంనీరు (ఫైల్)

కంచికచర్ల: మండలంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేసే అధికారులు ఉండే ప్రభుత్వ కార్యాలయాలు అవి. అయితే చిన్నపాటి వర్షం కురిసినా ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపునీరు చేరుతుంది. దీంతో కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, వివిధ పనులకోసం వచ్చే ప్రజలు వర్షాకాలంలో కార్యాలయాల దుస్థితిని చూసి చిరాకు పడటం పరిపాటిగా మారింది.

ఈ కార్యాలయాలకే సమస్య..

మండల కేంద్రానికి పలు సమస్యలపై గ్రామాల నుంచి ప్రజలు నిత్యం వస్తుంటారు. అధికారులకు గ్రామాల్లోని సమస్యలు తెలియజేసి వాటిని పరిష్కరించుకునేందుకు మండలంలోని గ్రామాల ప్రజలు వస్తుంటారు. కంచికచర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయం, మండల వనరుల కేంద్ర కార్యాలయం, డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, కేడీసీసీ బ్యాంకు, జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయం, గ్రామ సచివాలయం–2, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, పలుశాఖల కార్యాలయాలున్నాయి.

కారణం ఇదీ..

వర్షం కురిస్తే చాలు ప్రభుత్వ కార్యాలయాలు నీటిలో తేలియాడుతున్నట్లు కనిపిస్తాయి. ప్రభుత్వ కార్యాలయాలన్నీ లోతట్టుగా ఉండటంతో రోడ్డుపై పారుతున్న వర్షపునీరంతా ప్రభుత్వ కార్యాలయాల్లోకి చేరుతుంది. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ సౌకర్యం లేదు. దీంతో నీరంతా కార్యాలయాల ఆవరణలో నిల్వ ఉంటోంది. ఈ కారణంగా సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు.

కనిపించని వసతులు..

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు లేకపోవటంతో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రజలు వారి సమస్యలు తెలియజేసేందుకు, పరిష్కరించుకునేందుకు, అర్జీలు చేసుకునేందుకు నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. వసతులు లేకపోవటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగేందుకు నీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్ల సౌకర్యం లేదు. కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

ప్రభుత్వ కార్యాలయాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థ చేపట్టడంతోపాటు మెరక తోలాలి. తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది.



నీటిలో తేలియాడుతున్న కేడీసీసీ బ్యాంకు (ఫైల్)



తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చేరిన వర్షం నీరు (ఫైల్)

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి

పెనుగంచిప్రోలు: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. మంగళవారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. ముందుగా జాతీయ జెండా ఎగుర వేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్రీడలతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే వారి జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనపరచిన మండల స్థాయి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎంఎస్‌కే అరుణ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మురుకుట్ల శ్రీనివాసరావు, నియోజకవర్గ కార్యదర్శి గంటా వెంకటేశ్వరరావు, హెచ్ఎం కె. జలజ, పీడీ వేగినేటి వెంకటరమణ, బాబూప్రసాద్, పీఈటీ, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సముద్రాల రామారావు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నాగమణి, పక్కన పీడీ, పీఈటీలు

తిరుపతమ్మ ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మ ఆలయ ఈవోగా భూపతిరాజు వెంకట సత్యనాగ కిషోర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఉమాపతి, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాలి వెంకటరమణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో కిషోర్‌కుమార్

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుక

నందిగామ టౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సంజీవని హాస్పిటల్ వైద్యురాలు బొగ్గవరపు దివ్య పేర్కొన్నారు. స్థానిక కేవీఆర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల భారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. పెయిన్ కిల్లర్‌ను ఎక్కువగా తీసుకున్నా కూడా శరీరంలోని పలు అవయవాలకు హానీ కలుగుతుందన్నారు. వైద్యుల సూచన మేరకు మాత్రమే పెయిన్ కిల్లర్స్ తీసుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాయప్ప మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విభాగం అందించిన సామాజిక సేవా కార్యక్రమాలు మరువలేనివని తెలిపారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎన్ఎస్ఎస్ సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అనంతరం 'మత్తు పదార్థాలు– యువతపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాధిపతులు ఏలూరు పిచ్చేశ్వరరావు, మధుసూదనరావు, కిశోర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తాం

జగ్గయ్యపేట అర్బన్: ఇది మంచి మనసున్న ప్రభుత్వం అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. మంగళవారం స్థానిక మిట్టగూడెంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య నాయకులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు, స్టిక్కర్లను అంటించారు. అనంతరం మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు ఉద్యోగ భరోసా కల్పించేందుకు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రాష్ట్రాన్ని 2047 విజన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు తీసుకెళ్తారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి ఇళ్లకు స్టిక్కర్‌లు అంటించారు. పింఛన్‌ల పెంపు, అన్నా క్యాంటిన్‌లు, మెగా డీఎస్సీ, తదితర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు 100 రోజుల పాలనలో చేసిన పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, ఏపీఎం వెంకటేశ్వరరావు, కార్యదర్శి శివాజీ, సర్పంచ్ మణి, టీడీపీ నాయకులు కట్టా నరసింహారావు, గడ్డం ఏసుబాబు, బాబురావు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్

తిరువూరు: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్ కోసం కష్టపడి చదవాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. స్థానిక ప్రతిభ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాల బారిన పడవద్దని సూచించారు. విద్యా హక్కు చట్టాన్ని వివరించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు మోటారు వాహనాలను నడపడం నేరమన్నారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, కార్యదర్శి షేక్ గౌసుద్దీన్, న్యాయవాదులు మేకల నాగేంద్రప్రసాద్, సంకురాత్రి జనార్ధనరావు, రాజవరపు శ్రీనివాసరావు, భూక్యా రాము, ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్ నాయక్

విద్యార్థిని కుటుంబానికి సాయం

నందిగామ టౌన్: చందర్లపాడు మండలం ముప్పాళ్ల గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని కస్తాల అపర్ణ మృతి బాధాకరమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ముప్పాళ్ల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అపర్ణ జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. స్థానిక మార్చురీ వద్ద విద్యార్థిని మృతదేహాన్ని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల మనోవేదన తీర్చలేనిదని, విద్యార్థిని కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. విద్యార్థిని మృతి విషయాన్ని మంత్రులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం అందించి కుటుంబ సభ్యులలో ఒకరికి గ్రామ, వార్డు సచివాలయాలలో ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవి కిరణ్, ఆర్డీవో రవీంద్రరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సౌమ్య

వరద బాధితులను ఆదుకోవడం సామాజిక బాధ్యత

భారత్ గ్యాస్ దక్షిణ భారత్ జీఎమ్ పియూష్ గుప్తా

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద ముంపు బాధితులకు భారత్ గ్యాస్ సంస్థ దుప్పట్లను వితరణ చేసింది. విద్యాధరపురంలోని భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ శ్రీభవానీ గ్యాస్ కంపెనీ ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో భారత్ గ్యాస్ దక్షిణ భారత్ జనరల్ మేనేజర్ పియూష్ గుప్తా చేతుల మీదుగా బాధితులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవల్లో భాగంగా తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. ముఖ్యంగా విపత్తు సమయాల్లో బాధితులను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించామని పేర్కొన్నారు. వరద కారణంగా తమ డిస్ట్రిబ్యూటర్లు కూడా నష్టపోయారని, వారికి తగిన న్యాయం చేసేందుకు ఆలోచన చేస్తున్నామని తెలిపారు. భారత్ గ్యాస్ ఏపీ హెడ్ బాబ్జీ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లోని గ్యాస్ వినియోగదారుల వంట గ్యాస్ స్టవ్‌లకు ఉచితంగా మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకవచ్చామని చెప్పారు. శ్రీభవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు మాట్లాడుతూ వరదల కారణంగా నగరంలో సుమారు 6లక్షల మంది ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఈ సమయంలో 30వేల మంది బాధితులకు భోజనాలు ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో విజయవాడ టెరిటరీ మేనేజర్ వేణుగోపాల్, సేల్స్ ఆఫీసర్ చాంద్ మొండల్, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

విధుల్లో హిందీ తప్పనిసరి

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అధ్యక్షతన 188వ అధికార భాష అమలు కమిటీ సమావేశం మంగళవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా కవి రామధారీ సింగ్ దినకర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన రచించిన అత్యంత ప్రసిద్ధ పుస్తకంలోని 'రశ్మిరథి' నుంచి కొన్ని కవితలను చదివి వినిపించారు. డీఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి రోజువారి విధుల్లో అధికారిక భాష హిందీని ఉపయోగించడం తప్పనిసరన్నారు. డివిజన్‌లో అధికారిక భాష అమలులో హిందీ విభాగం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఏడీఆర్ఎం, అడిషనల్ ముఖ్య రాజభాష అధికారి పీఈ ఎడ్విన్ డివిజన్‌లో హిందీ భాష అమలులో సాధించిన పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడకు వచ్చిన వరదను కేంద్రప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి, ముంపు బాధితులకు తక్షణ సాయం అందించాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కరకట్ట ప్రాంతం 38వ డివిజన్‌లో పర్యటించి నిన్న పోలీసులు చేసిన లాఠీ చార్జ్‌లో దెబ్బలు తిన్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు రూ.10వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలని కోరారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఈ దిశగా ప్రయత్నం కూడా చేయలేదని అన్నారు. ఎన్యూమరేషన్ చేయకపోతే ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం రాదేమోనన్న భయంతో బాధితులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే జిల్లా యంత్రాంగం పనితీరు స్పష్టం అవుతుందన్నారు. ఇది కేవలం ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. రోడ్డెక్కిన బాధితులపై లాఠీ చార్జ్‌కు కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పంచదార్ల దుర్గాంబ, కంచర్ల నాగేశ్వరరావు, కోట రాంబాబు, ఎన్ వెంకటేశ్వరరావు, ఎస్కె షంషుద్దీన్, సీహెచ్ నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మానసిక ఆరోగ్యంతోనే శారీరక ఆరోగ్యం ముడిపడి ఉంటుందని పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.పద్మావతి అన్నారు. వాసవ్య మహిళా మండలి, ది లైవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కొండపల్లిలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశాలు అవగాహన పెంచుకోవాలన్నారు. రెండు వారాలకు పైగా మానసిక అనారోగ్యం లక్షణాలు కనిపిస్తే అలాంటి వారిని సమీపంలోని పీహెచ్‌సీలకు తీసుకురావాలన్నారు. మానసిక అనారోగ్యానికి గురైన వ్యక్తుల పరిస్థితులను ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కేశవ వివరించారు. వ్యాధి లక్షణాలు, నివారణోపాయాలు తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మావతి

అధిక దిగుబడికి సస్యరక్షణ చర్యలు అవసరం

పెనుగంచిప్రోలు: పంటల అధిక దిగుబడులకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ కె.రామసుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెనుగంచిప్రోలు, లింగగూడెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖలతో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, విద్యుత్ శాఖ ఏఈ పూర్ణచంద్రరావు, పశువైద్యాధికారి అనిల్, ఇరిగేషన్ జేఈ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకలోడు టిప్పర్ స్వాధీనం

నందిగామ టౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కంచల మున్నేటి నుంచి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారనే సమాచారంతో ఇసుక లోడ్ చేసుకుని రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను గమనించి తనిఖీ చేశామన్నారు. ఇసుక రవాణాకు సంబంధించి అనుమతి పత్రాలు లేవని గుర్తించి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. టిప్పర్ డ్రైవర్ పరారైనట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి హానికర చెట్ల తొలగింపు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రధాన రహదార్ల డివైడర్ల మధ్యలో ఉన్న హానికర కోనో కార్పస్ చెట్లను బుధవారం నుంచి యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. ఈ మొక్కలు ఆక్సిజన్‌ను పీల్చుకోవడం వలన మానవాళికి ఆక్సిజన్ తగ్గే అవకాశం ఉందన్నారు. వీటి పువ్వుల వలన చిన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలు వస్తాయని పర్యావరణ శాస్త్రవేత్తలు తెలియజేయడంతో తొలగించక తప్పడం లేదన్నారు. అతి త్వరలో వాటి స్థానాలలో పూలమొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు జరుగు ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 19 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

జుజ్జూరు(వీరులపాడు): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో అరుంధతీదేవి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో తాగునీరు, పారిశుద్ధ్యంపై మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కార్యదర్శులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తిరువూరురూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు కృషి చేయాలని తిరువూరు ఎంపీపీ గద్దల భారతి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. తహసీల్దార్ లక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కస్టమ్స్ ఉద్యోగుల స్వచ్ఛతా ర్యాలీ

విజయవాడస్పోర్ట్స్: వ్యక్తి నుంచి సమాజ స్థాయి వరకు పరిశుభ్రత నిరంతర ప్రక్రియగా కొనసాగితే అద్భుత ఫలితాలు వస్తాయని రాష్ట్ర కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ కాకర్ల ప్రశాంత్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవంలో భాగంగావిజయవాడలోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయ అధికారులు స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నగరంలో నడక ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభోత్సవంలో ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ రాజకీయాలకు అతీతమైందన్నారు. దేశాన్ని బాగుపరచేందుకు మనసా వాచా కర్మేణా అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పటమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ విద్యార్థులను స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు చేశారు. అసిస్టెంట్ కమిషనర్‌లు జి.సీతారామరాజు, పి.నాగేశ్వరరావు, సీపీఓ శ్రీమన్నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.